నమస్తే తెలంగాణ
సోమవారం 12 ఆగస్టు 2024
MONDAY, 12 AUGUST, 2024

# ఇదేనా స్వచ్ఛదనం-పచ్చదనం..!

- నందివనపర్తిలో ఏరులై పారుతున్న మురుగునీరు
- పాదులు తీసి నాటకుండా వదిలేసిన మొక్కలు
- అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమిదే..



చెత్తాచెదారంలో స్వైర విహారం చేస్తున్న పందులు

యాచారం, ఆగస్టు 11 : మండలంలోని నందివనపర్తి గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. మేడిపల్లి నుంచి నందివనపర్తి వెళ్లే దారిలో ఇండ్ల మధ్యనే మురుగునీరు ఏరులై పారుతున్నది. రోడ్డు పక్కనే చెత్తాచెదారం వేయడంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో గ్రామంలోని మురుగునీరంతా ఒకచోట చేరి దుర్గంధం వెదజల్లుతున్నది. దీంతో ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. అసలే వర్షాకాలం.. ఆపై సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఊసే కనిపించడంలేదు. ఇదే గ్రామంలో వన మహోత్సవం కింద నాటాల్సిన మొక్కలకు పాదులు తీసి, పాదుల పక్కన మొక్కలు వేసి వదిలేశారు. అధికారుల నిర్లక్ష్యంతో వాటిని నాటకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. పాదులు చెత్తాచెదారంతో కూరుకుపోతున్నాయి. నాటకుండా వదిలేసిన మొక్కలను పశువులు, మేకలు మేస్తున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఇండ్ల మధ్యనే పారుతున్న మురుగునీరు, పక్కనే నాటకుండా వదిలేసిన మొక్కలను పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ సిబ్బంది చూసీ చూడనట్లు వదిలేయడం గమనార్హం. దీంతో అటు స్వచ్ఛదనం.. ఇటు పచ్చదనంను పెంపొందించడంలో అధికారులు విఫలమైనట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో స్వచ్ఛతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించాలని కోరుతున్నారు.

నందివనపర్తిలో ఇండ్ల మధ్య పేరుకుపోయిన మురుగునీరు







నందివనపర్తిలో నాటకుండా వదిలేసిన మొక్కలు



# అన్నదాతలూ.. జరభద్రం

వర్షాలు పడుతుండడంతో మండలంలో వరి నాట్లు వేసే పనుల్లో అన్నదాతలు బిజీబిజీగా గడుపుతున్నారు. వాటితోపాటు ఇతర పంటల్లో కలుపు తీయడం, ఎరువులు వేయడం, మందులు పిచికారీ చేయడం పనుల్లో రైతులు, వ్యవసాయ కూలీలు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. పంటల సాగు సమయంలో అన్నదాతలు, వ్యవసాయ కూలీలు ప్రమాదాలకు గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు.

- మొయినాబాద్, ఆగస్టు 11



### జాగ్రత్తగా ఉండాలి..



వానకాలం సీజన్లో రైతులు, కూలీలు ప్రకృతి వైపరీత్యాలు, పిడుగుపాటు, పాములు, తేళ్లు, క్రిమి కీటకాల వల్ల ప్రమాదానికి గురవుతుంటారు. అదేవిధంగా పంటలు సాగు చేసే క్రమంలో పంటలకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు ముఖానికి మాస్కు ధరించాలి, చేతులకు గ్లౌజులు వేసుకుంటే చాలా మంచిది. చేనుకు ఎరువులు వేసి, పందులు పిచికారీ చేసిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కొని, స్నానం చేసిన తర్వాత భోజనం చేస్తే అస్వస్థతకు గురికాకుండా ఉంటాం.

**- రాగమ్మ, ఏవో, మొయినాబాద్**

### మందులు, ఎరువులు వినియోగించే సమయంలో..

* ఎరువులు, క్రిమిసంహారక మందులను పిచికారి చేసేటప్పుడు ముఖానికి మాస్కులు, చేతులకు గ్లౌజులు, కాళ్లకు రబ్బర్ బూట్లు ధరించాలి. మందులను కర్రసాయంతో కలుపుకోవాలి.

* మందులు పిచికారీ, చల్లడం వంటి పనులు పూర్తయిన వెంటనే చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి.

* స్నానం చేసిన తర్వాతనే భోజనం చేయాల్సి ఉంటుంది.

* పురుగు మందులు, ఎరువుల డబ్బాలను వాడిన వెంటనే సర్ఫ్‌తో శుభ్రం చేయాలి.

### పాములు, విషపురుగుల సంచారం..

* వర్షాకాలంలో పాములు, తేళ్లు, విషపురుగులు, క్రిమి కీటకాల సంచారం ఎక్కువగా ఉంటుంది.

* గట్ల వెంబడి, ఎలుకలు పెట్టిన బొరియల్లో పాములు, విష కీటకాలు, పురుగులు చేరి ఉంటాయి. గట్లపై ఎప్పుడూ గడ్డి పెరగకుండా చూసుకోవాలి.

* కలుపు మొక్కలను తొలగించేటప్పుడు, పొలాల గట్లపై నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.

* బోర్లు, మోటారు బోర్ల వద్ద గడ్డి, పిచ్చిమొక్కలు పెరగకుండా శుభ్రంగా ఉంచుకోవాలి

* ఏదైనా కీటకం కాటు వేసినట్లు అనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న వైద్యులను సంప్రదించి సరైన వైద్యం చేయించుకోవాలి.

* నాటు వైద్యం కోసం వెళ్లి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు.

## రేపు జిల్లా భూ సదస్సు



పరిగిలో జిల్లా భూ సదస్సు కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పరిగి, ఆగస్టు 11 : కొడంగల్‌లోని బసిరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 13న నిర్వహించే జిల్లా భూ సదస్సును విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం పరిగిలో జిల్లా భూ సదస్సు కరపత్రాలను వారు విడుదల చేశారు. పరిగి మండలం రంగాపూర్‌లోని సర్వే నం.18లో 9.39 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదల ఇండ్ల స్థలాలకు పంచాలని, నారాయణపూర్ పరిధిలో అన్యాక్రాంతమైన 32 ఎకరాల భూదాన్ భూమిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు ఇవ్వాలని, కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలంలో అభివృద్ధి పేరుతో పేద రైతుల భూములు లాక్కోవడాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ భూ సదస్సును నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



## యోగా పోటీల్లో 'దాస్ యోగశాల' ప్రతిభ

**—జిల్లా స్థాయిలో పలు పతకాలు కైవసం**

సిటీబ్యూరో, ఆగస్టు 11 : రంగారెడ్డి జిల్లా స్థాయి యోగా పోటీల్లో 'దాస్ యోగశాల' ప్రతిభ కనబరిచింది. బేగంపేటలోని స్వామి నారాయణ్ మందిరంలో 'రంగారెడ్డి జిల్లా స్థాయి యోగాసన, స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్–2024' పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దాస్ యోగశాల వ్యవస్థాపకుడు గుజరాతి సతీష్‌కుమార్ 45–55 ఏండ్ల విభాగంలో మొదటి స్థానం దక్కించుకున్నారు. ఆయన శిష్యురాలు చెరుకూరి కీర్తి ఆనంద్ ఆర్టిస్టిక్ యోగాసన 14–18 ఏండ్ల సింగిల్ విభాగంలో మొదటి స్థానం, ట్రెడిషన్ యోగాసనలో రెండో స్థానం సొంతం చేసుకున్నారు. అనన్యకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ దక్కింది. విజేతలకు తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి కృపాకర్ పతకాలతోపాటు మెడల్స్ ప్రదానం చేశారు.

## ప్రహరీ కూలినా పట్టించుకోరా..

- సురంగల్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలోకి వస్తున్న వీధి కుక్కలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

మొయినాబాద్, ఆగస్టు 11 : మొయినాబాద్ మండల పరిధిలోని సురంగల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రహరీని ఆనుకుని పెద్ద చెట్టు ఉంది. చెట్టు వేర్లు ప్రహరీలోంచి బయటకు రావడంతో గోడలు నెర్రలు బారి వర్షానికి కూలింది. దీంతో వీధి కుక్కలు పాఠశాల ప్రాంగణంలోకి వస్తున్నాయి. గోడ కూలిన ప్రాంతానికి రెండు మీటర్ల దూరంలో అంగన్‌వాడీ పాఠశాల కూడా ఉంటుంది. కుక్కలు ఎక్కడ కరుస్తాయోనని విద్యార్థులు భయపడుతున్నారు. ప్రహరీ కూలినా అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రహరీ నిర్మించి గేట్‌కు మరమ్మతులు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.





రైతులందరికీ రుణమాఫీ చేయాలని నినాదాలు చేస్తున్న రైతులు, ప్రజా సంఘాల నాయకులు

## నిబంధనలు లేకుండా రుణాలు మాఫీ చేయాలి

బొంరాస్‌పేట, ఆగస్టు 11 : బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న ప్రతి రైతుకూ రుణ మాఫీ చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్, కళాకారుల సంఘం నాయకుడు బాలు, కేవీపీఎస్ జిల్లా నాయకుడు లక్ష్మయ్య తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం వారు కొత్తూరులో రైతులతో కలిసి మాట్లాడారు.

2015, 2016, 2017 సంవత్సరాల్లో పంట రుణాలు తీసుకున్న రైతులు 2018 డిసెంబరు 12 వరకు రెన్యువల్ చేస్తేనే రుణ మాఫీ వర్తిస్తుందని నిబంధనలు పెట్టారని.. ఇలాంటి నిబంధనల వల్ల చాలా మంది రైతులకు రుణమాఫీ జరగక అన్యాయం జరిగిందన్నారు. లక్షలోపు రుణాలు తీసుకున్న చాలా మంది రైతులకు రుణమాఫీ ఎందుకు కాలేదని వ్యవసాయాధికారులను, బ్యాంకు అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించి రైతులందరికీ రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే డిమాండ్‌తో సోమవారం జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని వారు తెలిపారు.

## ముగిసిన 'ది పీడియాట్రిక్ అనస్థీషియా కనెక్ట్' సదస్సు

అమీర్‌పేట్, ఆగస్టు 11: రెండు రోజుల పీడియాట్రిక్ అనస్థీషియాలజిస్టుల సమావేశం ఆదివారం ముగిసింది. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్ అనస్థీషియాలజిస్ట్స్ (ఐఏపీఏ) తన మిడ్ టర్మ్ సీఎంఈ–2024 'ది పీడియాట్రిక్ అనస్థీషియా కనెక్ట్' అనే అంశంపై బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో శని, ఆది వారాల్లో నిర్వహించిన సదస్సుకు దేశవ్యాప్తంగా 150 మందికి పైగా అనస్థీషియాలజిస్టులు, పీడియాట్రిక్ అనస్థీషియాలజిస్టులు, పీడియాట్రిషన్లు హాజరయ్యారు. పీడియాట్రిక్, నియోనాటల్, పెరియమోపరేటివ్ కేర్, ప్రొసీజర్స్‌లో అందుబాటులోకి వస్తున్న ఆధునిక విధానాలపై వైద్యులు లోతుగా చర్చించారు. దేశ జనాభాలో 40 శాతం మంది పిల్లలుండగా పీడియాట్రిక్ సర్జికల్, మత్తు మందు సేవలకు గణనీయమైన డిమాండ్ నెలకొందని, ఈ నేపథ్యంలో పీడియాట్రిక్ అనస్థీషియాలజీని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీనియర్ కన్సల్టెంట్ అనస్థీషియాలజిస్ట్, ఐఏపీఏ అధ్యక్షుడు డాక్టర్ రాజా నర్సింగ్‌రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ సిస్టంలో మార్పులు చేయాలి

తెలుగు యూనివర్సిటీ, ఆగస్టు 11: నేషనల్ ట్రాన్సిట్ పర్మిట్ సిస్టంలో మార్పులు చేయాలని జీఎస్టీ వే బిల్లు మాదిరిగా ఫార్మ్–II పర్మిట్ వెంటనే ఆన్‌లైన్‌లో తీసుకురావాలని తెలంగాణ టింబర్ మర్చంట్స్ సామిల్ అల్లైడ్ ఇండస్ట్రీస్ రాష్ట్ర అధ్యక్షుడు చకిలం రమణయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాంపల్లిలోని ఫ్యాప్సీ భవన్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫార్మ్–II పర్మిట్ ఆన్‌లైన్‌లో వచ్చే వరకు మాన్యువల్ బిల్స్ ఇవ్వాలని కోరారు. సామిల్ రూల్‌లో జీవో 69లో లేని సిస్టమ్‌ను వ్యాపారస్తులు పర్మిట్ ద్వారా ఖరీదు చేసి దిగుమతి చేసుకున్న టింబర్‌ను 24 గంటల్లో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కు తెలియజేయాలన్నారు. కలప కోత మిషన్‌లో దుగోడ మిషన్ అనుమతి ఇవ్వాలని గ్రౌండ్ స్టాక్ అనే అంశాన్ని జీఓ 69 నుంచి తీసివేయాలన్నారు. సా మిల్లు లైసెన్సులు రెన్యువల్ అప్లికేషన్‌లో ఫార్మ్–IIIలో జీఎస్టీ, ఐటీ రిటర్న్స్ అడుగుతున్నారని, వాటికి మినహాయింపు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల కలప వ్యాపారస్తులు టింబర్ డిపోల, సా మిల్లర్లు ఈ సమావేశంలో హాజరై ఈ ప్రతిపాదనలను బలపరిచారు. ఈ సమావేశంలో ఆలిండియా టింబర్ ఫెడరేషన్ అడ్వైజర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు, ప్రధాన కార్యదర్శి గోపి కృష్ణ, కోశాధికారి పురుషోత్తం పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# గాడి తప్పిన స్వచ్ఛత

### ఎక్కడపడితే అక్కడ నిర్మాణ వ్యర్థాలు

**డంపింగ్ యార్డులా మారిన ప్రధాన రహదారులు**
**వ్యర్థాల సేకరణకు కొత్త టోల్ ఫ్రీ నంబర్..**
**ఫలితం శూన్యం**

సిటీబ్యూరో, ఆగస్టు 11 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్‌లో భవన నిర్మాణ వ్యర్థాల తరలింపు ప్రక్రియ గాడితప్పింది. ఎక్కడ పడితే అక్కడే నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. నిర్మాణ వ్యర్థాల సేకరణకు టోల్ ఫ్రీ నంబర్ ఇచ్చారు. జీడిమెట్ల, ఫతుల్లాగూడ, మల్కాజిగిరి, శంషాబాద్, తూంకుంటల్లో సీ అండ్ డీ రీసైక్లింగ్ ప్లాంట్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా భవన నిర్మాణ, కూల్చి వేసిన వ్యర్థాలను రోడ్డు, ఫుట్‌పాత్, నాలాలు, చెరువులు, అనుమతి లేని ప్రదేశాల్లో పడేస్తున్నారు. భవన నిర్మాణ వ్యర్థాలను సీ అండ్ డీ ప్లాంట్లకు తరలించాలని, ప్రజలు ఇబ్బందులు కలిగేలా అనుమతి లేని ప్రదేశాల్లో పారబోస్తే.. బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించినా.. ఫలితం లేకుండాపోతున్నది. జోనల్ పరిధిలో సర్కిళ్ల వారీగా నిర్మాణ వ్యర్థాల కలెక్షన్ పాయింట్లు, మినీ వాహనాలు, ట్రాక్టర్ల ద్వారా తరలించే వ్యవస్థ కనబడటం లేదు. ఫలితంగా భవన నిర్మాణ వ్యర్థాలతో గ్రేటర్‌లోని ప్రధాన రహదారులు డంపింగ్ యార్డులకు నిలయాలుగా మారుతున్నాయి. 'స్వచ్ఛ హైదరాబాద్' లక్ష్యం నీరుగారుతున్నది.

### టోల్‌ఫ్రీ నంబర్లపై పర్యవేక్షణ కరువు?

ఖైరతాబాద్ జోన్ పరిధిలోని మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ సర్కిల్‌తో పాటు, చార్మినార్ జోన్‌లోని చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, చార్మినార్, రాజేంద్రనగర్ సర్కిల్, కూకట్‌పల్లి, అల్వాల్, సికింద్రాబాద్ జోన్‌లో మల్కాజిగిరి, ముషీరాబాద్, సికింద్రాబాద్, బేగంపేట సర్కిల్ నిర్మాణ వ్యర్థాల సేకరణకు తూంకుంట, శంషాబాద్ ప్లాంట్‌కు సంబంధించిన వాట్సాప్ నంబర్ 73300 00203ను సంప్రదించాలని, లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1800–203–0033కు ఫోన్ చేస్తే ఇంటికి వచ్చి వ్యర్థాలను తీసుకొని వెళ్తారని కమిషనర్ తెలిపారు. అదే విధంగా కూకట్‌పల్లి జోన్‌లో మూసాపేట్, కూకట్‌పల్లి, గాజులరామారం, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి జోన్ యూసుఫ్‌గూడ, చందానగర్, శేరిలింగంపల్లి, ఆర్సీపురం సర్కిళ్లకు, సికింద్రాబాద్ జోన్ అంబర్‌పేట, ఎల్బీనగర్ జోన్‌లో ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, చార్మినార్ జోన్‌లో మలక్‌పేట, సంతోష్‌నగర్ సర్కిళ్లలో ఫతుల్లగూడ, జీడిమెట్ల ప్లాంట్లకు సంబంధించిన వాట్సాప్ నంబర్ 9100 927 073కు లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1800–120–1159కు కాల్ చేస్తే.. ఇంటికి వచ్చి తీసుకొని వెళ్తారని అధికారులు పేర్కొన్నారు. ఇందుకు టన్నుకు జీహెచ్ఎంసీ నిర్ణయించిన రుసుం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో మాత్రం భవన నిర్మాణ వ్యర్థాల తరలింపు సజావుగా సాగడంలేదు.





### వ్యర్థాలు ఎత్తేవారేరీ..?

వారాసిగూడలోని రహదారి వెంట వ్యర్థాలు ఇలా పడేయడంతో అటుగా వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. నగరాన్ని స్వచ్ఛతగా మారుద్దామంటూ..పిలుపునిచ్చే బల్దియా నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతున్నారు.

